# ప్రధానమైనది భక్తి



మూర్ఖోవదతి విష్ణాయ
విద్వాన్ వదతి విష్ణవే
ఉభయోశ్చ ఫలం తుల్యం
భావగ్రాహీ జనార్దనః

**భావం:** (విష్ణువుకై అని చెప్పవలసి వచ్చినప్పుడు) చదువు రాని మూర్ఖుడు విష్ణాయ అని (తప్పు)గా అంటాడు. చదువుకున్న విద్వాంసుదు విష్ణవే అని (సరిగా) అంటాడు. ఇద్దరికీ ఫలితం సమంగా లభిస్తుంది. ఆ జనార్దనుడు భావాన్ని మాత్రమే గ్రహిస్తాడు.

రామేశ్వరంలోని ఆలయంలో పురాణం చెప్తున్నారు. కాశీ క్షేత్ర మహాత్మ్యం, గంగాతీర నివాస ఫలం గంగ ఒడ్డున జపం చేస్తే కైలాసవాసప్రాప్తి మొదలైనవన్నీ విన్న ఇద్దరు భక్తులకు గంగాతీరంలో జపం చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్న కోరిక కలిగింది. వారిలో ఒకడు కొద్దిగా ధనవంతుడు గుఱ్ఱాలను బాడుగకు తీసుకుని గంగాతీరం చేరుకుని శివుని గూర్చి జపం చేయసాగాడు.

రెండవవాడు ధన హీనుడే కాక అమాయకుడు కూడా. అతనికి కాశీ ఎక్కడ ఉందో గంగా తీరానికి ఎంత దూరం ప్రయాణం చెయ్యాలో ఏమీ తెలియదు. కాశీ చేరుకుని గంగా తీరాన జపం చెయ్యాలన్న కోరిక మాత్రం ఉంది. నెమ్మదిగా నడవడం ప్రారంభించాడు. కొన్ని రోజులకు తామ్రపర్ణీ నదిని చేరుకున్నాడు. ఎదురైన నది గంగ అనుకున్నాడు. అక్కడ తపస్సు ప్రారంభించాడు. కొంత కాలానికి ఒక యాత్రికుల బృందం అక్కడకు వచ్చింది. మాటల సందర్భంలో వారు గంగా స్నానం చేసి తిరిగి వస్తున్నట్లు తెలిసింది.

" అయ్యో ఈ నది గంగ కాదా"

"ఇది తామ్రపర్ణీ నది"

భక్తుడు తిరిగి ఉత్తర దిక్కు నడవసాగాడు. ఇంకొక నది ఎదురైంది. ఆ నది తామ్రపర్ణి కన్నా వెడల్పుగా ఉంది. ఇది గంగానదే అయి ఉంటుంది అనుకుని అక్కడ జపం చేసుకోసాడు.

కొంత కాలానికి అది కావేరీ నది అని తెలిసింది. ఆ అమాయక భక్తుడు ఉత్తరదిశగా నడక సాగించి పినాకినీ, కృష్ణా, గోదావరీ తీరాలను గంగ ఒడ్డుగా భావించి తపస్సు చేసుకుంటూ మహేంద్రతనయా తీరానికి చేరుకున్నాడు. మహానదినే గంగగా భావిస్తూ తపస్సు చేసుకుంటున్న అతనికి ఆయుష్షు తీరింది. అదే సమయంలో గంగానది ఒడ్డున మొదటి భక్తుడు

కూడా మరణించాడు. ఇద్దరినీ కైలాసానికి తీసుకుపోవడానికై శివభటులు వచ్చారు.

మొదటి భక్తుడు " నేను గంగా తీరంలో తపస్సు చేశాను. అతడు గంగను చూడనైనా లేదు. ఇద్దరినీ ఒకేలా తీసికెడతారా' అన్నాడు. శివభటులు "ఇతడు తాను ఏ నదీ తీరంలో తపస్సు చేసినా గంగ ఒడ్డునే చేశానన్న నమ్మకంతో చేశాడు. అందుకే అతనికి గంగా తీర తపః ఫలం లభించింది. చదువు రాని వాడు తప్పుగా విష్ణాయ అన్నా. విద్వాంసుడు విష్ణవే అన్నా ఆ జనార్ధనుడు భావాన్ని గ్రహిస్తాడు. కానీ భాషను పట్టించుకోడు. శివకేశవులకు భేదం లేదు. శివుడైనా భక్తి భావాన్నే గుర్తిస్తాడు" అన్నారు.

స్వచ్ఛమైన ఆవు నేతితోనే దీపారాధన చేస్తామనీ, బంగారు పూలతోనే పూజలు చేస్తామనీ గొప్పలు కొట్టుకునేవారు భక్తి ప్రపత్తులు ముఖ్యమని గ్రహిస్తే మంచిది.

******